క్లుప్తంగా

చిన్నారులకు నాణ్యమైన విద్య

• ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సత్యవతి, తదితరులు

పూసపాటిరేగ: చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయమని భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సత్యవతి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో 'పోషణ్ బీ - పడాయి బీ' కార్యక్రమంపై రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులకు సులభమైన రీతిలో అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించాలన్నారు. జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

27న వైస్ ఎంపీపీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి వెంకటరమణ

భోగాపురం: మండల వైస్ ఎంపీపీ ఎన్నిక ఈ నెల 27న జరగనున్నట్లు జెడ్పీ డిప్యూటీ సీఈఓ, ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలలోపు వైస్ ఎంపీపీ పోటీలో ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఎన్నికకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గౌరవ సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ గాయత్రి పాల్గొన్నారు.

అక్కివరంలో తాగునీటి సరఫరా



కుళాయి కనెక్షన్ ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ బీసీ కాలనీలో మినీట్యాంక్ ద్వారా సోమవారం తాగునీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు కంది చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. కాలనీలో రూ. 3 లక్షలతో మినీ ట్యాంక్, కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు కంది సూర్యనారాయణ, ఉప సర్పంచ్ కంది సత్యనారాయణ, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోగికి వైద్యం ఖర్చు అందజేత



పాపయ్యమ్మకు రూ. 2 వేలు ఇప్పిస్తున్న టీమ్ లీడర్ జనార్దనరావు

విజయనగరం ఫోర్ట్: వైద్యం కోసం ఖర్చు చేసిన డబ్బులను ఓ రోగికి తిరిగి ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ ఇప్పించారు. పట్టణంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రిని సోమవారం సాయంత్రం ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ తుంపల్లి జనార్దనరావు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఏమైనా ఉందా, సకాలంలో సేవలు అందిస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఈసీజీ, టూడీ ఈకో పరీక్షలకు రూ. 2 వేలు ఖర్చు చేసినట్టు పాపయ్యమ్మ ఆయన దృష్టికి తీసుకురావడంతో .. వెంటనే ఆమెకు రూ. 2 వేలు తిరిగి ఇప్పించారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యంతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా జరుగుతాయన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే ఆరోగ్యమిత్రకు గాని టీమ్ లీడర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ జనరల్ ఆస్పత్రిలో ఓ మహిళకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గరివిడి మండలం కోడూరు గ్రామానికి చెందిన కొత్తింటి నారాయణమ్మ అనే 70 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స నిమిత్తం మిమ్స్ ఆస్పత్రిలో చేరింది. వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె క్లిష్టమైన హెర్నియాతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వెంటనే ఆస్పత్రి శస్త్రచికిత్స నిపుణులు కేసీటీ నాయక్, కృష్ణచైతన్య బొత్స ఆధ్వర్యంలో సర్జరీ హెచ్ఓడీ ఎన్‌సీపీ నరసింహారావు, మెడికల్ సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వరరావు, తదితరులు నారాయణమ్మకు ఇటీవల సర్జరీ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ..హెర్నియాకు అధునాతన పద్ధతిలో సర్జరీ చేసినట్లు తెలిపారు.

పాఠశాలల్లో జలగంట

• వేసవి నేపథ్యంలో చిన్నారులకు ఎప్పటికప్పుడు తాగునీరు
• పాఠశాలల్లో నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు, నిపుణులు



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

విజయనగరం: వాతావరణంలో ఎప్పటికప్పుడు మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఈ సమయంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు నీరు ఎంతో అవసరం. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యాలయాల్లో జలగంట మోగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఈ విధానం కేరళలో అమలులో ఉంది. గతంలో ఈ విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేశారు. ఆ తర్వాత దీని గురించి పెద్దగా పట్టించుకున్న దాఖలాలులేవు. ఎందరో చిన్న పిల్లలు సరిగ్గా అల్పాహారం తినక.. నీరు తాగకుండా పాఠశాలలకు వెళుతుంటారు. ఈ సమయంలో ఎండవేడి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోతుంటారు. ఇటువంటి సంఘటనలు పలు బడుల్లో తరచూ చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ బెల్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇటు నిపుణులు అటు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

రోజు వారీ పిల్లలు తీసుకోవాల్సిన నీటి వివరాలు	
వయస్సు (సంవత్సరాలు)	తీసుకోవాల్సిన నీరు (లీటర్లలో)
4-8	1.2
9-13	1.7
14-18	1.9

ప్రతిరోజూ రెండుసార్లు



ప్రతి పాఠశాలలో సాధారణంగా విరామ సమయం ఇస్తారు. దీంతో పాటు అదనంగా మరో రెండుసార్లు జలగంట కొట్టాలి. దీనికోసం కనీసం అయిదు నిమిషాలు కేటాయిస్తే విద్యార్థులు నీరు తాగే అవకాశం ఉంటుంది. మనం తీసుకునే ఆహారం ద్వారా 20 శాతం నీరు శరీరానికి చేరుతుంది. ఆహారం జీర్ణం అయ్యేటప్పుడు మరో పదిశాతం ఉత్పత్తి అవుతోంది. మిగిలిన 70 శాతం ద్రవాల రూపంలో శరీరానికి మనమే అందించాలి. అందుకే పిల్లలు నీటిని ఎక్కువగా తీసుకునే వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జలగంటను ఎండతీవ్రత పెరిగే ఈ సమయాల్లో తప్పకుండా అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల చిన్నారులకు వడదెబ్బతో పాటు అనారోగ్య సమస్యలు దరిచేరవనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో తప్పనిసరి

సాధారణ రోజులతో పోల్చుకుంటే వేసవిలో ప్రతి ఒక్కరూ ఎక్కువ మోతాదులో నీరు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎండ వేడిమికి చెమట రూపంలో నీరు బయటకుపోతుంది. ఈ నేపథ్యంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రతి రోజూ లీటర్ నుంచి రెండు లీటర్ల నీరు తాగేలా అలవాటు చేయాలి. పాఠశాలల యాజమాన్యాలు ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు.

– శ్రీనివాసరావు, వైద్యుడు

28న న్యాయవాదుల సంఘ ఎన్నిక

• ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడి పదవులు ఏకగ్రీవం
• అధ్యక్ష, సంయుక్త కార్యదర్శి పదవులకు ఎన్నిక

విజయనగరం లీగల్: ప్రతిష్టాత్మకమైన జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘ ఎన్నికలు ఈ నెల 28న జరగనున్నాయి. సుమారు 630 మంది సభ్యులున్న ఈ సంఘం ఎన్నికలు ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో జరుగుతుంటాయి. అయితే ఈసారి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దేశ వ్యాప్తంగా అన్ని న్యాయవాదుల సంఘ ఎన్నికలు ఒకేసారి జరగాలని నిర్ణయించింది. దీంతో ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా చేపడుతున్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. ఏప్రిల్ నుంచి కొత్త కార్యవర్గం బాధ్యతలు స్వీకరిస్తారు.

అధ్యక్ష పదవికి ముఖాముఖి

న్యాయవాద సంఘ అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు దవళ వెంకటరావు, కలిశెట్టి రవిబాబు పోటీ పడుతున్నారు. దీంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. వీరు హోరాహోరీగా ప్రచారం చేపడుతున్నారు. ఇక సంయుక్త కార్యదర్శి పదవికి బార్నాల సీతారామరాజు, సారిక సతీష్ తలపడుతున్నారు.

ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులు ఏకగ్రీవం



ఏకగ్రీవమైన ప్రధాన కార్యదర్శి నళితం సురేష్



పి.శివప్రసాద్, సంఘ ఉపాధ్యక్షుడు

ప్రధాన కార్యదర్శి పదవికి నళితం సురేష్ కుమార్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆ పదవి ఏకగ్రీవమైంది. సీనియర్ న్యాయవాది కోలగట్ల తమ్మన్నశెట్టి, ఎస్.రమేష్‌కుమార్ చొరవతో సభ్యులందరూ సురేష్ వైపు మొగ్గు చూపడంతో అది కాస్తా ఏకగ్రీవమైంది. ఇక ఉపాధ్యక్ష పదవికి పి. శివప్రసాద్, పి.బ్రాహ్మజీ, ఎంఎస్ఎన్ రెడ్డి నిలవగా.. సీనియర్ న్యాయవాదులు రంగప్రవేశం చేసి వారితో చర్చించడంతో శివప్రసాద్‌కు ఉపాధ్యక్ష పదవి ఏకగ్రీవమైంది. అలాగే గ్రంథాలయ కార్యదర్శి మహిళా ప్రతినిధి, సీనియర్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవులు కూడా ఏకగ్రీవమయ్యాయి.

రవాణా రంగ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు

• ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ డిమాండ్

విజయనగరం గంటస్తంభం: ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎ. జగన్ మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్థూల జాతీయ ఆదాయంలో నాలుగు శాతం రవాణా రంగం నుంచి వస్తోందన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న 10 కోట్ల మంది రవాణా రంగ కార్మికుల గొంతు నులిపే విధంగా కేంద్రంలో మోదీ ప్రభుత్వం మోటార్ వాహన చట్టంలో మార్పులు చేసిందని మండిపడ్డారు. అందులో భాగంగానే అగ్రిగ్రేటర్స్ పేరుతో ఓబర్, ఓలా, రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలు రవాణా రంగంలోకి ప్రవేశించాయని ఆరోపించారు. ఫీజులు, ఫెనాల్టీలు పెంచుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 21ని రద్దు చేస్తామని.. ప్రతి డ్రైవర్‌కి సంవత్సరానికి రూ. 15 వేల ఆర్థిక సహాయం చేస్తామని చెప్పిన కూటమి నాయకులు వెంటనే హామీలను అమలు చేయాలని కోరారు. సీఐటీయూ నగర కార్యదర్శి బి రమణ, ఆటో యూనియన్ నాయకులు బి. పాపారావు, భాస్కర్ రావు మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఏ అధికారులు ఈ చలానాలు విధిస్తుండడంతో ఆటోలు నడపడం కష్టంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆటో రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, భాస్కరరావు, ప్రసన్న, ఆనంద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుపై సీపీఐ పోరుబాట

• సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య



పోరుబాట కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటివరకు పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు, ఇళ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగు ముందుకు పడలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య ఆరోపించారు. ఈ మేరకు సీపీఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో మార్క్సనగర్ నుంచి పట్టణ పురవీధుల్లో సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి ఆర్థిక సాయం అందించాలన్నారు.అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, ఎస్.నాగభూషణం, మారూక్స్, నాయకులు అప్పరుబోతు జగన్నాథం, బూర వాసు, వెలగాడ రాజేష్, పొందూరు అప్పలరాజు, ఏఐటీయూసీ నాయకులు పొడుగు రామకృష్ణ, అల్లి మరయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఆశీల వేలంపాట మరోసారి వాయిదా

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో ఆశీలు వసూలు చేసుకునే నిమిత్తం సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంపాట మళ్లీ వాయిదా పడింది. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం బహిరంగ వేలంపాట నిర్వహించగా ఒక్కరూ హాజరుకాలేదు. దీంతో 25వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ అప్పలరాజు తెలిపారు. గతంలో ఒకసారి వేలంపాట వాయిదా వేసినట్లు కమిషనర్ చెప్పారు. 25వ తేదీ ఉదయం 11.30 గంటలకు జరగనున్న బహిరంగ వేలంలో ఆసక్తిగల వారు పాల్గొనాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

విజయనగరం: నగరంలోని ఖాళీ స్థలాలు, నిరుపయోగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, నిరుపయోగ ప్రాంతాలు ఉండడంతో ఆయాచోట్ల చెత్తాచెదారాలను వేయడం ద్వారా అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోందన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేయించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక రేపు

పూసపాటిరేగ: ఈ నెల 26న స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం. రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ సభ్యురాలి మృతి



పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి నిర్మల (55) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. నెలరోజుల కిందట బెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. నిర్మల జెడ్పీటీసీగా, వెంపడాం సర్పంచ్‌గా, వెంపడాం పీఏసీఎస్ అధ్యక్షురాలిగా సేవలు అందించారు. నిర్మల భర్త పిన్నింటి వెంకట రమణ రాజకీయాలలో క్రియాశీలకంగా ఉన్నారు. కుమారుడు పిన్నింటి కుమార్ వెంపడాం సర్పంచ్‌గా ఉన్నారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వైన్‌షాపు తొలగించాలి



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న మద్దిల సోంబాబు

విజయనగరం టౌన్: పట్టణంలోని నల్లచెరువు సమీప దేవదాయ శాఖ భూమిలో ఏర్పాటు చేసిన వైన్‌షాపును తొలగించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దిల సోంబాబు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైన్‌షాపు వల్ల సమీప శివాలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి దేవదాయశాఖ స్థలంలో ఉన్న వైన్‌షాప్‌ను తొలగించాలని కోరారు.

నిరుపయోగంగా ఫ్రిజ్‌లు



వివిధ అవసరాల నిమిత్తం నగరానికి వచ్చే పేదలతో పాటు నగరంలోని నిరాశ్రయులకు ఉచితంగా ఆహారం అందించాలనే సదుద్దేశంతో విజయనగరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన విలువైన ఫ్రిజ్‌లు ప్రస్తుతం కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనలతో పాలకవర్గం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఫుడ్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా ఆహారాన్ని అందించిన విషయం విధితమే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుడ్‌బ్యాంక్‌ల సేవలు నిలిపివేశారు. దీంతో అప్పట్లో ఆహారాన్ని నిల్వ చేసేందుకు కొనుగోలు చేసిన ఫ్రిజ్‌లు ప్రస్తుతం కార్పొరేషన్ కార్యాలయంలో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. విలువైన వస్తువులను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – విజయనగరం

అభినందనలు..



ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అటు ప్రజలకు ఇటు యువతకు అవగాహన కల్పిస్తూ షార్ట్ ఫిల్మ్ తీసిన మండలానికి చెందిన యువకులను సీఐ ఎస్వీ ప్రభాకర్ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో షార్ట్ ఫిలిం డైరెక్టర్ పి. రాజు, టీమ్ సభ్యులు శ్రావణ్, ప్రసాద్, వెంకటేష్, మహేశ్, రాజు, రాజేష్ పాల్గొన్నారు. – భోగాపురం

విద్యార్థుల ఆర్థిక సాయం..



పట్టణంలోని వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుష్టు బాధితుల సంక్షేమం కోసం సోమవారం ఆర్థిక సాయం చేశారు. 21, 475 రూపాయలు సేకరించి ఆ మొత్తాన్ని లెప్రా సొసైటీ ప్రతినిధి రమణకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి



నిరసన ర్యాలీలో హిజ్రాలు

విజయనగరం టౌన్: అనకాపల్లిలో హిజ్రాను హత్య చేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండబాబు, అధ్యక్ష, కార్యదర్శులు దవడ మీనాకుమారి, స్రవంతి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అనకాపల్లిలో ఈ నెల 19న దీపు అనే హిజ్రాను ఆమెతో సహజీవనం చేసే దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీ అనే వ్యక్తి అత్యంత దారుణంగా హత్యచేశాడని తెలిపారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిజ్రాస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని దుకాణాలు సీజ్



పన్ను కట్టని దుకాణాలను సీజ్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

విజయనగరం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరికొద్ది రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో ఇంతవరకు పన్ను చెల్లించని దుకాణాలను విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది సీజ్ చేస్తున్నారు. సహాయ కమిషనర్ కె. అప్పలరాజు నేతృతంలో రెవెన్యూ సిబ్బంది పన్ను వసూలు ప్రక్రియలో భాగంగా సోమవారం స్థానిక పీడబ్ల్యూ మార్కెట్ ప్రాంతంలో ఆస్తిపన్ను బకాయిల వసూళ్లను చేపట్టారు. అయితే కొంతమంది బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో కొన్ని దుకాణాలను మూసి వేయించారు.దీంతో కొంతమంది తక్షణమే స్పందించి పన్నులు చెల్లించేందుకు అంగీకరించారు. మిగిలిన వారు కూడా త్వరలోనే పన్నులు చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అప్పటివరకు దుకాణాలను తెరవకూడదని సహాయ కమిషనర్ కె.అప్పలరాజు దుకాణదారులకు హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి ప్రజలు చెల్లించిన పన్నులే ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలన్నారు.

• శిథిలావస్థలో కాలువలు



శిథిలమైన కాలువ

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని కీర్తివీధిలో మురుగునీటి కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ వీధిలోని మొదటి లైన్‌లో కాలువలు పూర్తిగా పాడవ్వడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కాలువ పాడవ్వడంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటురోగాల ప్రబలుతున్నాయని, వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.